సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



ఘనంగా శాంతి ర్యాలీ

బాబయ్య స్వామి దర్గా 751వ ఉరుసును పురస్కరించుకుని మంగళవారం పెనుకొండలో శాంతి ర్యాలీ ఘనంగా సాగింది.

8లో



టమాట కిలో రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

32.6°/ 16.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొన సాగింది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీలో ఓపీ సేవలు



పెద్దమంతూరు విలేజ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరులో మంజూరైన రెండో పీహెచ్‌సీలో ఓపీ సేవలు ప్రారంభించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెద్దమంతూరు సబ్‌సెంటర్, విలేజ్ క్లినిక్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, డాక్టర్లు ప్రవీణ్, రమ్య, డీపీఎంఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఎండుమిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ఘాటెక్కుతోంది. మార్కెట్‌లో రోజురోజుకూ ధర పెరుగుతుండగా సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంది. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 175 క్వింటాళ్ల మిర్చి రాగా, క్వింటా గరిష్టంగా రూ.21,000 పలికినట్లు మార్కెట్ యార్డ్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.9,000, సరాసరిన రూ.14,000 మేర ధర పలికినట్లు ఆయన వెల్లడించారు.

మణిపూర్ జానపదం అదరహో



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మణిపూర్ సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మణిపూర్ సత్యసాయి భక్తులు మంగళవారం సంగీత విభావరి నిర్వహించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో సుమారు గంట పాటు కార్యక్రమం జరిగింది. మణిపూర్ జానపద 'నుపి పాల' సంగీత రీతిలో విష్ణుమూర్తి దశావతారాలను వివరిస్తూ సాయి కుల్వంత్ సభా మందిరాన్ని మార్మోగించారు.

నేడు జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం

పుట్టపర్తి అర్బన్: జిల్లా విజిలెన్స్ కమిటీ(ఆహార భద్రతా చట్టం 2017) సమావేశం బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశంలో జరగనుంది. కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో ఆహార భద్రత చట్టం అమలుపై సమీక్ష ఉంటుందని డీఆర్‌ఓ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కమిటీ మెంబర్లు, ప్రజాప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొంటారని డీఆర్‌ఓ పేర్కొన్నారు.

జనవరి 6న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



అనంతపురం: జనవరి ఆరో తేదీన అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ–ఏ) 13వ స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీల చాన్సలర్/ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వీసీ ఆచార్య జింకా రంగజనార్దన మంగళవారం తెలిపారు. స్నాతకోత్సవ నిర్వహణకు వివిధ కమిటీలను నియమించినట్లు వెల్లడించారు. స్నాతకోత్సవ వేళ పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ అందజేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకే విద్యార్థులు జేఎన్‌టీయూకు చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆడుదామా ఆంధ్రా!





- క్రీడా సంబరానికి చురుగ్గా సన్నాహాలు
- ఈ నెల 15 నుంచి 51 రోజుల పాటు క్రీడోత్సవం
- సచివాలయాలకు చేరుకున్న క్రీడా సామగ్రి
- నేటితో ముగియనున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- జిల్లా నుంచి ఇప్పటికే 1.42 లక్షల మంది నమోదు

కదిరి: గ్రామీణ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'ఆడుదాం..ఆంధ్రా' క్రీడా పోటీలకు జిల్లా నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే 1.42 లక్షల మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటితో ముగియనుంది.

5 క్రీడాంశాల్లో పోటీలు

దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంరంభానికి శ్రీకారం చుట్టారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఇలా మొత్తం 5 క్రీడాంశాల్లో 51 రోజుల పాటు గ్రామ సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.

ఆడేందుకు 1.42 లక్షల మంది... చూసేందుకు 11 లక్షల మంది

'ఆడుదాం ఆంధ్రా'కు జిల్లా నుంచి నేరుగా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకున్న వారు 57,915 మంది కాగా, ఇంటింటి సర్వేలో మరో 84,256 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతానికి శ్రీసత్యసాయి జిల్లా నుంచి 1,42,171 మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే ఈ క్రీడా పోటీలను చూసి ఆనందించడానికి ఏకంగా 11,03,079 మంది పేర్లు నమోదు చేసుకోవడం గమనార్హం. నేటివరకూ గడువు ఉండగా, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

544 సచివాలయాల్లో క్రీడా పోటీలు

జిల్లా వ్యాప్తంగా 544 సచివాలయాల పరిధిలో బాలురు, బాలికలను వేర్వేరు జట్లుగా విభజించి 'ఆడుదాం..ఆంధ్రా' పోటీలు నిర్వహించనున్నారు. వాలీబాల్ జట్టులో 12 మంది, కబడ్డీలో 12 మంది, ఖోఖో జట్టులో 15 మంది, క్రికెట్‌లో 16 మంది, బ్యాడ్మింటన్ జట్టుకు ఇద్దరు చొప్పున క్రీడా కారులు ఉండే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సచివాలయ స్థాయి పోటీలు ఈ నెల 15 నుంచి జనవరి 1వ తేదీ వరకు, మండల స్థాయి పోటీలు జనవరి 2 నుంచి 15వ తేదీ వరకూ, నియోజకవర్గ స్థాయి పోటీలు జనవరి 16 నుంచి 21వ తేదీ వరకూ, జిల్లా స్థాయి పోటీలు జనవరి 22 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ఇలా..

- క్రీడాకారులకు 15 సంవత్సరాలు నిండి ఉండాలి.
- ప్రభుత్వ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు టోర్నీలో పాల్గొనేందుకు అర్హులు కాదు.
- ఒక క్రీడాకారుడు గరిష్టంగా రెండు క్రీడాంశాల్లో మాత్రమే పాల్గొనేందుకు అర్హులు.
- బాల బాలికలకు వేర్వేరుగా టోర్నీని నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.
- స్థానికతను తెలియజేసేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి.
- వయసు నిర్ధారణ కోసం పుట్టినతేదీ సర్టిఫికెట్ ఉండాలి.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ	జిల్లాస్థాయిలో	రాష్ట్రస్థాయిలో
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ.15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ	జిల్లాస్థాయిలో	రాష్ట్రస్థాయిలో
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ.లక్ష
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.50 వేలు

ఖోఖోలో ప్రతిభ చూపిస్తా



నాకు ఖోఖో అంటే చాలా ఇష్టం. రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో నేను ఖోఖో క్రీడలో పేరు నమోదు చేసుకున్నా. అన్ని స్థాయిల్లో ప్రతిభ కనబరచి నగదు బహుమతులు గెలుచుకొని మా పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తా.

–మౌనికాభాయ్, 10వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, కొండమనాయునిపాళ్యం, కదిరి మండలం

జగన్ మామయ్యకు ధన్యవాదాలు



'ఆడుదాం ఆంధ్రా' పోటీలు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మామయ్యకు క్రీడాకారులందరి తరపున ధన్యవాదాలు. గతంలో ఎన్నడూ ఇంతలా క్రీడా సంబరాలు చేయలేదు. నేను క్రికెట్‌లో నా ప్రతిభ కనబరచి బహుమతులు గెలుచుకొని వస్తా. చదువుతో పాటు నన్ను క్రీడల్లో కూడా బాగా ప్రోత్సహిస్తున్న నా తల్లిదండ్రులతో పాటు మా పాఠశాల గురువులకు రుణపడి ఉంటా.

–పి.అభిషేక్, 10వ తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, కేఎస్ పాళ్యం, కదిరి మండలం

మంచి స్పందన వస్తోంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు జిల్లాలో మంచి స్పందన లభించింది. ఇప్పటికే 1.42 లక్షల మందికిపైగా క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారు. అందరి సహకారంతో ఈ క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా సామాగ్రిని ఇప్పటికే జిల్లాలోని 544 సచివాలయాలకు పంపించాం.

–ఉదయ్ భాస్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో జిల్లావాసులకు చోటు

- యువజన విభాగంలో గంగుల సుధీర్, ప్రభాకర్
- మహిళా విభాగంలో కార్యదర్శులుగా ఇద్దరికి అవకాశం

సాక్షి, పుట్టపర్తి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధిష్టానం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రాష్ట్ర యువజన, మహిళా విభాగం కమిటీల్లో జిల్లా వాసులకు అవకాశం కల్పించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన గంగుల సుధీర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సిద్ధప్పగారి ప్రభాకర్‌కు చోటు కల్పించారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం కార్యదర్శులుగా జిల్లాకు చెందిన పి.సాయిలీల, డి.భారతిని నియమించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా పదవులు దక్కించుకున్న వారు మాట్లాడుతూ.. తమ ఎంపికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఇచ్చిన బాధ్యతలకు న్యాయం చేస్తామని.. పార్టీ బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా భస్మాభిషేకం



తాడిపత్రి అర్బన్: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం రాత్రి తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో కాశీ విశ్వేశ్వరునికి భస్మాభిషేకాన్ని వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వీరికి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు జిల్లాకు కేంద్ర బృందం

- కరువు అంచనా కోసం క్షేత్రస్థాయి పర్యటన
- పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో పంటల పరిశీలన
- ఇప్పటికే ప్రభుత్వానికి అందిన ఇన్‌పుట్ సబ్సిడీ జాబితా



పుట్టపర్తి వద్ద వాడుబట్టిన వేరుశనగ

పుట్టపర్తి అర్బన్: తీవ్ర వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు నేడు (బుధవారం) కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యులతో కూడిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (కేంద్ర బృందం) జిల్లాలో పర్యటించనుంది. ఉదయం అనంతపురం నుంచి బయలుదేరనున్న బృందం సభ్యులు పరిగి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో పర్యటించనున్నారు. పంకజ్ యాదవ్ నేతృత్వంలో దేవేంద్రరావు, ప్రదీప్, అంజు కూడిన కమిటీ సభ్యులు పరిగి మండలం మోద, యర్రగుంట, అలాగే మడకశిర మండలం హరేసముద్రం, కదిరేపల్లి, గుడిబండ మండలం మందలపల్లి, అమరాపురం మండలం వలస గ్రామాల్లో పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి కానున్నారు. కేంద్ర బృందానికి కరువు పరిస్థితులను వివరించేందుకు అధికారులు ఫొటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

రూ.105 కోట్లతో అంచనాలు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో జిల్లాలోని 1.17 లక్షల మంది రైతులు రూ.105.04 కోట్ల విలువైన దిగుబడులు కోల్పోయారు. దీనిపై వ్యవసాయాధికారులు ఇప్పటికే అంచనాలు తయారుచేసి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి నివేదించారు. ప్రధానంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటలు దెబ్బతిన్నాయని నివేదికలో పేర్కొన్నారు. అలాగే ప్రతి రెవెన్యూ గ్రామంలో ఇద్దరు రైతుల పొలాలను ఎంపిక చేసుకొని పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ వివరాలనూ ప్రభుత్వానికి నివేదిక పంపారు. 33 శాతం కంటే తక్కువ దిగుబడులు వచ్చిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు.

చెనిక్కాయకే ఎక్కువ నష్టం

గత ఖరీఫ్‌లో 1,17,005 మంది రైతులు వేరుశనగ, కంది, రాగి, సన్‌ఫ్లవర్, మొక్కజొన్న, కొర్ర, జొన్న, ఉలవలు, పెసలు, పత్తి, ఆముదం, సజ్జ, అరికలు, అలసంద ,చిక్కుడు తదితర పంటలను సాగు చేశారు. వర్షాభావంతో 49,410 మంది రైతులు 37,962 హెక్టార్లలో పంటలు కోల్పోయారు. దీంతో అధికారులు రూ.64.54 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరుకు నివేదికలు పంపారు. అలాగే 9548.75 హెక్టార్లలో కందికి రూ.9.55 కోట్లు, 16,241 హెక్టార్లలో మొక్కజొన్న పంటకు రూ.20.30 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు.

కరువు మండలాల ప్రకటన

జిల్లాలో 32 మండలాలుండగా, తీవ్ర వర్షాభావం ఎదుర్కొన్న 21 మండలాలను ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చింది. ఇందులో ఎన్‌పీకుంట, మడకశిర, అమరాపురం, అగళి, గుడిబండ, రొళ్ల, , పరిగి, కనగానపల్లి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, బుక్కపట్నం, కొత్తచెరువు, రొద్దం, సోమందేపల్లి, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయి. కరువు జాబితాలోని మండలాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో కుటుంబానికి 150 రోజుల పని దినాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పడిప్పుడే జిల్లాలో కరువు పనులు ఊపందుకున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన



కదిరేపల్లి ఆర్బీకేలో ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు

మడకశిర రూరల్: కేంద్ర బృందం పర్యటన సందర్భంగా మంగళవారం సాయంత్రం జిల్లా వ్యవసాయశాఖ అధికారి వైవీ సుబ్బారావు మండలంలోని కదిరేపల్లిలో పర్యటించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న వివిధ పంటల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో రబీ పంటల సాగు విస్తీర్ణం, సబ్సిడీ విత్తన రాగులకు ఎంత మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే రాగులను ఎక్కువ మంది రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ తిమ్మప్ప, సర్పంచ్ నర్సేగౌడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


సత్యసాయికి నాగాభరణం



పుట్టపర్తి రూరల్: సత్యసాయి బాబా పాలరాతి విగ్రహం మెడలో నాగుపాము చుట్టుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. పుట్టపర్తి పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రహదారి వద్ద గల ఆర్గ్ సంగ్ విల్లాస్ గృహ సముదాయంలో సోమవారం కన్పించిన ఈ దృశ్యం ఒకరోజు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన ప్యాటీ క్లైన్ మెన్ అనే భక్తురాలు సాయిబాబా విగ్రహాలతో మందిరాన్ని నిర్మించింది. నిత్యం ఆమె పూజలు నిర్వహిస్తూ ఉంటుంది. అనుకోకుండా ఒక పెద్ద నాగుపాము తన ఇంటి ఆవరణలోని మందిరంలోకి ప్రవేశించింది. సత్యసాయి బాబా విగ్రహం మెడకు చుట్టుకుని విగ్రహాన్ని ముద్దాడుతూ కనిపించింది. దీంతో ఆమె ఈ విషయాన్ని సమీపంలోని ప్రజలకు తెలియజేసింది. వారు అక్కడకు చేరుకుని నాగుపాముకు పాలు, నీళ్లు తాపి.. పసుపు, కుంకుమ, పూలు చల్లుతూ పూజలు చేశారు. నాగుపాము కొన్ని గంటల పాటు విగ్రహాన్ని చుట్టుకుని పడగవిప్పి ఆరాధిస్తున్నట్లుగా అక్కడే ఉండి పోయింది. ఈ దృశ్యాన్ని చూడటానికి భక్తులు ఎగబడ్డారు.

'పల్లెనిద్ర'.. ప్రజలతో మమేకం

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- ఎస్పీ మాధవరెడ్డి



పెనుకొండలో డీఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పెనుకొండ/రొద్దం: 'పల్లెనిద్ర' కార్యక్రమం ద్వారా గ్రామీణులతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా చెక్ పెడతామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పెనుకొండ డీఎస్పీ కార్యాలయంతో పాటు రొద్దం పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పెనుకొండ డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఎస్పీ కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'పల్లె నిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పోలీసులు రోజూ ఒక గ్రామంలో రాత్రి వేళ బస చేసి మట్కా, గ్యాంబ్లింగ్, మహిళలపై దాడులు, వేధింపులు, రౌడీయిజం వల్ల తలెత్తే ఇబ్బందులు ఇతరత్రా విషయాలను గ్రామీణులకు వివరించి వారిలో చైతన్య పరుస్తామన్నారు. అలాగే ఆయా స్టేషన్‌ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించి వారి కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. అంతకుముందు ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో గంజాయి రవాణా, కర్ణాటక మద్యం నియంత్రణ కోసం కట్టుదిట్టంగా పని చేయాలని సూచించారు. ఎన్‌డీపీఎల్ కేసులు, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో పెండింగ్‌లో ఉన్న వారెంట్లను అమలు చేయాలన్నారు. గ్రామాల్లో మహిళా పోలీసుల బాధ్యత ఎంతో కీలకమైనదని, ప్రజలతో మమేకమై సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రాత్రి వేళ పహారా పెంచాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెంచే విధంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. 'కియా' పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధించిన ఫైల్‌ను అందజేయాలని డీఎస్పీని ఆదేశించారు. పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో సిబ్బంది పని తీరు బాగుందని, నేరాల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారని కితాబు ఇచ్చారు. సమావేశంలో డీఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు సుబ్బరాయుడు, రాజారమేష్, ఎస్‌ఐలు విజయకుమార్, రాజేష్, సీసీ రాఘవేంద్ర, పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమస్యాత్మక గ్రామాలపై గట్టి నిఘా ఉంచాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. రొద్దం స్టేషన్‌కు తనిఖీ సందర్భంగా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా కేసులపై ఆరా తీశారు. శాంతిభద్రతలపై విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఊపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డిని కలిసి అర్చకుడు గిరీష్ స్వామి పెద్దాంజనేయస్వామి దేవాలయానికి ఆనుకుని ఉన్న పోలీస్ స్టేషన్ స్థలాన్ని ఆలయానికి కేటాయించి, పోలీస్ స్టేషన్‌కు అనుకుని ఉన్న ప్రవేట్ స్థలాన్ని స్టేషన్ కోసం సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆ స్థలాన్ని ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఆ స్థలానికి సంబంధించిన వివరాల పంపాలని డీఎస్పీ హుసేన్‌పీరాను ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రాజారమేష్, ఎస్‌ఐ వలీబాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళ్లను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: అవయవాలన్నింట్లో అతి ముఖ్యమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. సత్యసాయి విదేశీ భక్తురాలు అన్నా మోనికా ముల్లర్ ఆర్థిక సహకారంతో ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి, జగరాజుపల్లిల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 169 మందికి పరీక్షలు నిర్వహించారు. 40 మందికి కాటరాక్ట్ శస్త్రచికిత్స చేయాలని గుర్తించారు. 129 మందికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరాలను డీఎంహెచ్‌ఓ పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాధి సోకిన వెంటనే వైద్యుల్ని సంప్రదించి వైద్యం పొందాలన్నారు. కాగా, 40 మందికి బెంగళూరులోని మంజునాథ్ నేత్రాలయలో సర్జరీ చేయించి ఇళ్లకు చేరుస్తామని పీఆర్‌డీఎస్ సెక్రటరీ ప్రభాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, మహమ్మద్ షరీఫ్, డాక్టర్ బషీర్, డాక్టర్ అనిల్, ల్యాబ్ టెక్నీషియన్ మురళీ, పీఆర్‌డీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకి వాహనుడి ముంగిట కార్తీక శోభ

పావగడ: స్థానిక శనీశ్వరాలయం కార్తీక శోభ సంతరించుకుంది. కాకివాహనుడి సన్నిధిలో మంగళవారం లక్ష దీపోత్సవం కనులపండువగా సాగింది. ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, ఇతర పదాధికారులు వేడుకలను ప్రారంభించగా.. దీపాలను వెలిగించడానికి మహిళలు పోటీ పడ్డారు. కొవ్వొత్తుల వెలుగుల్లో ఆలయ ప్రాంగణం దేదీప్యమానమైంది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి.



వెలుగులీనుతున్న శనీశ్వరుడి ఆలయ పరిసరాలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలందుకున్న స్వామివారు

జనవాక్కు

మా కుటుంబానికి రూ1.75 లక్షల లబ్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎప్పుడూ లేని విధంగా లబ్ధి కలిగింది. మా కుటుంబానికి వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పింఛన్, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ రైతు సున్నా వడ్డీ, పంట బీమా పథకాల ద్వారా ఇప్పటివరకూ రూ. 1,75,061 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఈడిగ అలివేలమ్మ, జమ్మానిపల్లి మడకశిర మండలం

అవస్థలు తప్పాయి



గతంలో అర్హత ఉన్నా పథకాలు పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. ఇంటికే వచ్చి వలంటీర్లు వివరాలు సేకరిస్తూ అవస్థలు తప్పించారు. ఈ ప్రభుత్వం వచ్చాక రూ.1.57 లక్షలకు పైగా మా కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మాకు భరోసా కల్పించిన సీఎం జగన్ మేలు మరువలేం.

– శంకర్‌రెడ్డి, జమ్మానిపల్లి, మడకశిర మండలం

ఏటా ఆదుకుంటున్నారు



కూలీ పనులకు వెళ్తే గానీ కుటుంబం గడవని మాకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేదోడుగా నిలుస్తున్నాయి. నాకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. మా అబ్బాయి చదువుకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు ఎంతో చేయూతనందిస్తున్నాయి. నాకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 అందిస్తూ సీఎం జగన్ భరోసా కల్పించారు.

–మన్నల నాగలక్ష్మి, నార్శింపల్లి, తాడిమర్రి

జగన్‌కే మద్దతు..



సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయి. నాకు వైఎస్సార్ చేయూతతో పాటు పెన్షన్ క్రమం తప్పకుండా అందుతోంది. వ్యవసాయ, కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నా. ఇద్దరు కుమారుల్లో ఒకరికి పెళ్లైంది. కోడలు ఎం.ఫార్మసీ చదువుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 లక్షలు అందింది. సంక్షేమ లబ్ధితో ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగన్ మళ్లీ సీఎం కావాలని దేవుడిని కోరుకుంటున్నా.

– జయమ్మ, దొమ్మరహట్టి గ్రామం, రొళ్ల మండలం

ఎస్సీ కార్పొరేషన్‌కే బురిడీ

అనంతపురం క్రైం: కొందరు ఉద్యోగుల్లోని బలహీనత అతనికి బలమైంది. లొసుగులను బ్లాక్ మెయిల్ చేస్తూ కొందరిని, డబ్బుతో మరికొందరిని బుట్టలో వేసుకుని తన పనులు చక్కబెట్టుసుకుంటూ వచ్చాడు. చివరకు తన కులాన్ని మార్చేసి ఎస్సీగా నకిలీ ధ్రువీకరణ పత్రం పొందిన ఆ మాయలోడు... ఏకంగా ఎస్సీ కార్పొరేషన్‌కే బురిడీ కొట్టించాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని రాజధానిలోని ఉన్నతాధికారులు గుర్తించి చివాట్లు పెట్టడంతో జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌లో చలనం వచ్చింది. వివరాలు...

దళితుల పథకాలపై కన్నేసి..

దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ పలు పథకాలు అమలు చేస్తుండడంతో వాటిని అప్పనంగా కాజేయాలని అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన పి.విజయ్ బాబు భావించాడు. వాస్తవానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పథకాలేవీ వర్తించవు. దీంతో 2018–19లో తాను మాదిగ కులానికి చెందిన వాడిగా నకిలీ కుల ధ్రువీకరణ పత్రాన్ని పొంది నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ) కింద ఇన్నోవా వాహనాన్ని తీసుకున్నాడు. ఆ తర్వాత ఎస్సీలకు వర్తిస్తున్న పథకాలు అడపాదడపా కాజేస్తూ వచ్చాడు.

బయటపడిందిలా..

కొద్ది రోజుల క్రితం గుంటూరు జిల్లా తుళ్లూరు నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం విజయ్ బాబు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును పరిశీలించిన అధికారులు ఏ జిల్లాకు చెందిన వారని ఆరా తీశారు. దీంతో తాను మాదిగ కులానికి చెందిన వాడినని, తనకు గతంలో ప్రభుత్వం ఇన్నోవా కారు కూడా మంజూరు చేసిందని చెప్పాడు. ఆ సమయంలో అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన అధికారులు వివరాలు సేకరించుకుని పంపేశారు. అనంతరం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు వేగవంతమైంది. ఎస్సీ కార్పొరేషన్‌ను బురిడీ కొట్టించిన విజయ్‌బాబు... బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్నట్లు నిర్ధారించుకున్నారు. కాగా, మొత్తం నేరం అనంతపురంలో ముడిపడి ఉండడంతో కేసును జిల్లా పోలీసులకు రెఫర్ చేశారు. విజయ్‌బాబు ఎస్సీ కాదని, బీసీగా నిర్ధారణ అయిన తర్వాత అనంతపురం ఎస్సీ కార్పొరేషన్ అధికారులపై ప్రధాన కార్యాలయ అధికారులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విచారణ చేపట్టకుండా ఎస్సీలకు చేకూరాల్సిన లబ్ధిని బీసీలకు ఎలా కట్టబెట్టారంటూ నిలదీశారు. దీంతో ఆగమేఘాలపై సోమవారం రాత్రి 9 గంటలకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య చేరుకుని విజయ్‌బాబు చేసిన మోసంపై సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

చిలమత్తూరు: విద్యార్థినుల ఆరోగ్యంపై అశ్రద్ధ కనబరచరాదని డీసీడీఓ మాధవి సూచించారు. మంగళవారం స్థానిక కేజీబీవీని ఎంపీడీఓ నరేష్‌కృష్ణతో కలిసి డీసీడీఓ పరిశీలించారు. విద్యార్థిని నవ్య ఆత్మహత్యాయత్నంపై సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. కాలం చెల్లిన పాల ప్యాకెట్లు వాడటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీడీఓ మాధవి

తపాలా ఉద్యోగుల సమ్మెబాట



అనంతపురంలోని హెడ్‌పోస్టాఫీసు ఎదుట బైఠాయించిన గ్రామీణ తపాలా ఉద్యోగులు

అనంతపురం సిటీ: గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లిపోయారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి సమ్మెబాట పట్టారు. తొలి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,600 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. 843 గ్రామీణ ప్రాంత తపాలా కార్యాలయాలు మూతపడ్డాయి. తపాలా సేవలు స్తంభించిపోయాయి. అనంతపురంలోని డివిజన్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య మాట్లాడారు. సమ్మెలోకి వెళ్తే మీకు భవిష్యత్ లేకుండా చేస్తామంటూ కొన్ని చోట్ల ఉన్నతాధికారులు సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నారని మండిపడ్డారు.

సజ్జలను కలసిన ఉపాధ్యాయ నేతలు



సజ్జల రామకృష్ణారెడ్డితో వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

పుట్టపర్తి: వైఎస్సార్ టీఎఫ్, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు మంగళవారం విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. పీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లుల విడుదల తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంపై సజ్జల సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, కల్పలతారెడ్డి, అప్పిరెడ్డి, నాయకులు అశోక్ కుమార్ రెడ్డి, రమణారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, సురేంద్ర తదితరులున్నారు.

ఖాతాలో రూ. 3.19 లక్షల మాయం

తనకల్లు: బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 3.19 లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. తనకల్లుకు చెందిన ప్రసాద్ ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల ఒకటిన స్థానిక ఎస్‌బీఐలోని తన అకౌంట్‌లో రూ. 4 లక్షలు జమ చేశాడు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో అకౌంట్ నుంచి నాలుగుసార్లు రూ. 25 వేలు, ఇంకోసారి 1.29 లక్షలు, మరోసారి రూ. 89 వేలు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. ప్రసాద్ వెంటనే ఎస్‌బీఐ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాడు. కదిరి డీఎస్పీ శ్రీలత సూచన మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కొనసాగుతున్న సెబ్ దాడులు



మట్కా చీటీలు చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సెబ్ దాడులు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం తనకల్లు మడకశిర, హిందూపురం, కొడికొండ చెక్‌పోస్టుల్లో దాడులు నిర్వహించారు. 227 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలో 4 టన్నుల ఇసుక సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. హిందూపురం టౌన్ పరిధిలో మట్కా బీటర్లను అరెస్టు చేసి రూ. 11,930 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కదిరి సెబ్ స్టేషన్ పరిధి కట్ల తాండాలో 19 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు.

సోమందేపల్లి మండలంలో..

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి గ్రామంలో మంగళవారం రాత్రి 80 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. నిందితుడు శంకరప్పను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు.

ఘనంగా శాంతి ర్యాలీ



500 అడుగుల జాతీయ జెండా ఊరేగిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో మంగళవారం శాంతి ర్యాలీ ఘనంగా సాగింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన బాబయ్య స్వామి దర్గా 751వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ హుస్సేన్‌పీరా ప్రారంభించారు. పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో 500 అడుగుల జాతీయ జెండా ఊరేగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు కలసిమెలసి జీవించాలన్నారు. మత సామరస్యాన్ని మరింతగా పెంపొందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెనుకొండ రవిశంకర్‌గురూజీ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలిచాంద్‌బాషా, ముస్లిం నగారా జాతీయ అధ్యక్షులు ఉమర్‌ఫారూక్, బహుజన వేదిక నాయకులు శివరామకృష్ణ, సమతా సంస్థ ఆదినారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజినేయులు, పెద్దన్న, హ్యూమన్‌రైట్స్ షమీవుల్లా, ఎంఎస్ మూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.